ప్రజాశక్తి
ఆదివారం 10 నవంబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

కూటమిలో నామినేటెడ్ సందడి

- టిడిపికి నాలుగు, జనసేనకు రెండు పదవులు
- కీలకమైన ఎపిఐఐసి చైర్మన్‌గా డేగల ప్రభాకర్
- ఉండవల్లి శ్రీదేవికి మాదిగ కార్పొరేషన్ కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వివిధ కార్పొరేషన్లకు రాష్ట్రస్థాయి చైర్మన్‌లను శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఖరారు చేశారు. ఉమ్మడి జిల్లాలో నలుగురికి అవకాశం కల్పించారు. కీలకమైన ఎపిఐఐసి చైర్మన్ పదవి నగర టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్‌కు దక్కింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించిన ఆయనకు సామాజిక సమీకరణల్లో అవకాశం రాలేదు. దీంతో ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని సిఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు రెండో విడత జాబితాల్లో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) చైర్మన్‌గా ప్రభాకర్‌ను నియమించారు. దాదాపు 20 ఏళ్ల పాటు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ప్రభాకర్‌కు కీలకమైన పదవి కట్టబెట్టడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఈ పోస్టులో ఆర్‌కె రోజా, అంబటి రాంబాబు వంటి సీనియర్ నేతలు పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించారు. 2023లో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో వైసిపి నుంచి టిడిపిలోకి వెళ్లిన ఆమె గత ఎన్నికల్లో సీటు పొందలేక పోయారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మన్నవ మోహన్‌కృష్ణకు టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు ఎన్నికల ముందే జనసేనలో చేరారు. ఆయనకు అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ పదవి దక్కింది. గతంలో వైసిపిలో పనిచేసిన ఆయన



▶ 2లో



వార్త మెయిన్‌లో

స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు శనివారం విజయనగరం జిల్లా భోగాపురంలో ప్రారంభం కాగా పోటీల్లో పాల్గొని ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల జట్లు

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



ఎసిసి కార్మికుల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ఎసిసి కార్మికులకు ప్రజాపోరు మద్దతు

దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిపిఎం ప్రచార యాత్ర బృందం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్ష శిబిరాన్ని ప్రజాపోరు ప్రచార యాత్ర బృందం సందర్శించి మద్దతు తెలిసింది. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ సరైన ఉపాధి లేక సామాన్య ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వాలు నిత్యావసర సరుకులు ధరలు ఇబడి ముబ్బడిగా పెంచాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల మీద ప్రభుత్వాలు నియంత్రణ కోల్పోయాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గటం లేదని దుయ్యబట్టారు. జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర పరిధిలో ఉన్న సహకార సంఘాల ఎన్నికలను వివిధ రకాల పేర్లు చెప్పి కేంద్ర ప్రభుత్వం వాయిదా వేస్తుందని గుర్తు చేశారు. మతాన్ని రాజకీయాలకు జొప్పించి బిజెపి మానవ హననానికి పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉచిత ఇసుక విధానం అంటూనే గత ప్రభుత్వంలో మాదిరిగానే నేటి కూడా ఇసుక బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని, సరైన ఉపాధి దొరక్క భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మహిళలపై, బాలికలపై హత్యలు, లైంగిక దాడులు జరగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. వ్యవస్థలన్నిటినీ గత ప్రభుత్వం నాశనం చేసిందని చెబుతున్న సిఎం చంద్రబాబు... వాటిని బాగు చేయడానికి తీసుకుంటున్న చర్యలేమిటో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై 14న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు ప్రజలు తరలిరవాలని పిలుపునిచ్చారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ స్థలాల్లో కార్మికులు పక్కా ఇళ్లు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన సమస్యను ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు కె.కరుణాకర్‌రావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు కె.ఆదినారాయణ, కార్మికులు వై.యశోవ, నాగేశ్వరరావు, ఆశీర్వాదం, బి.అంకయ్య, సుబ్బారావు, శారద, ఇమాంబి, సాంబయ్య, నాయక్ పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంచుతూ మాట్లాడుతున్న విజయ్‌కుమార్, ఇతర నాయకులు

విద్యుత్ భారంపై సిఎం సమాధానమివ్వాలి

- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- నరసరావుపేటలో ప్రజాపోరు ప్రచార యాత్ర

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిత్యాసర ధరలను అదుపు చేయాలని, విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని నిలిపేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ చేపట్టిన ప్రజాపోరు ప్రచార యాత్రను పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో శనివారం నిర్వహించారు. కోడెల శివప్రసాదరావు స్టేడియం, చంద్రబాబు నాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లో సిపిఎం శ్రేణులు కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ

▶ 2లో



రూ.75.24 లక్షల బయో ఉత్పత్తుల పట్టివేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

వినుకొండ పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేని బయోప్రొడక్ట్స్ అమ్మకాలపై వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు, స్థానిక అధికారులతో కలిసి 3 ప్రత్యేక బృందాలు నియోజకవర్గంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టగా పలువురు ఎరువుల వ్యాపారులు తమ దుకాణాలకు తాళాలు వేసి వెళ్లిపోయారు. తలుపులు తీసి ఉన్న షాపుల వరకు అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సుమారు రూ.4 లక్షల విలువైన ఎరువులు అమ్మకాలు నిలిపివేశారు. అనంతరం పట్టణ సమీపంలోని మార్కాపురం రోడ్డు, కోల్డ్ స్టోరేజ్ ఎదురుగా ఉన్న అనధికార గొడౌన్ (నెం-44) లో బయో ప్రొడక్ట్స్ ఉన్నాయని గుర్తించి పోలీస్ బందోబస్తు మధ్య గొడౌన్ తాళాలు పగులగొట్టి చూడగా అందులో అనుమతులు లేని,

▶ 2లో



ఉత్కంఠగా బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో 68వ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలను ఎమ్మెల్యే బి.రామాంజనేయులు శనివారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఆయన అనంతరం హిట్టింగ్ చేసి ఉత్సాహ పరిచారు. క్రీడల్లో రాణించడం ద్వారా రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. గెలుపోటములు సమానంగా స్వీకరించడం ద్వారా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పొనకల బాలసుబ్రమణ్యం, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాల వారీగా జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు విశాఖపట్నం మధ్య మ్యాచ్‌లో గుంటూరు జిల్లా జట్టు 5-2 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల జట్ల మధ్య మ్యాచ్‌లో 7-2 పాయింట్లతో శ్రీకాకులం గెలుపొందింది. విజయనగరం, కర్నూలు తలపడగా 2-1 పాయింట్లతో కర్నూలు విజయం సాధించింది. అనంతపురం, చిత్తూరు మధ్య మ్యాచ్‌లో 5-4 పాయింట్లతో అనంతపురం గెలిచింది. చివరి లీగ్ మ్యాచ్‌లో గుంటూరు జట్టు నెల్లూరు



జట్టుపై 7-1 పాయిట్ల ఆధిగ్యంతో విజయకేతనం ఎగురవేసింది. బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా, తూర్పుగోదావరి జిల్లా జట్లు తలపడగా 7-1 పాయింట్లతో ప్రకాశం జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. శ్రీకాకుళం, అనంతపురం తలపడగా 4-2 పాయింట్లతో శ్రీకాకుళం గెలిచింది. విజయనగరం, పశ్చిమ గోదావరి మధ్య మ్యాచ్‌లో 2-1 పాయిట్ల స్వల్ప ఆధిక్యగంతో విజయనగరం విజయం సాధించింది. గుంటూరు, కర్నూలు మధ్య మ్యాచ్‌లో 8-2 తేడాతో గుంటూరు భారీ విజయాన్ని నమోదు చేసింది. విశాఖపట్నం, కృష్ణాజిల్లా జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠగా సాగక 4-3 పాయిట్లతో విశాఖ జట్టు గెలుపొందింది.

విఆర్‌కు అరండల్‌పేట సిఐ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

బోరుగడ్డ అనిల్ కుమార్ వ్యవహారంలో అరండల్‌పేట సిఐ కె.శ్రీనివాసరావును విఆర్‌కు పంపుతూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి శనివారం రాత్రి పొద్దుపోయిన తరువాత ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఈ ఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ శాఖా నిబంధనలు పాటించకుంటే క్రమ శిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - చేబ్రోలు

మండంలోని కొత్తరెడ్డిపాలెం టిడిపి నాయకులు కారుమూరి జీవరత్నం, చేబ్రోలు నాయకులు ఉగ్గం అంకమ్మరావు తండ్రి ఉగ్గం శ్రీనివాసరావు ఇటీవల మరణించిన నేపథ్యంలో వారి కుటుంబాలను ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ శనివారం పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మైలా వెంకట రామరాజు, జనసేన మండల అధ్యక్షులు చందు శ్రీరాములు, టిడిపి నాయకులు అజిత్ కుమార్, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

విద్యుత్ భారంపై సిఎం సమాధానమివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. విద్యారంగాన్ని నాశనం చేస్తోందని, నిరుద్యోగం పెరుగుతున్నా యువతకు ఉపాధి కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరి ప్రజలపై విపరీత భారాలకు సిద్ధమైందన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరిట రూ.18 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల అమలు చేసేందుకు పూనుకుందన్నారు. విద్యుత్ చార్జీలను ఎందుకు పెంచారో ప్రజలకు సిఎం చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ ప్రజలపై భారాలు మోపబోమని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి మరి ప్రజలపై మోయలేని విధంగా భారాలను వేస్తున్నాయన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు డి.శివకుమారి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, స్కీమ్ వర్కర్లు తమ సమస్యలపై సాగిస్తున్న పోరాటాలకు అండగా సిపిఎం నిలిచిందని గుర్తు చేశారు. వేతన ఒప్పందాలను అమలు చేయకుండా మొండికేసిన యాజమాన్యాలు దిగొచ్చేలా చేయడంలో సిపిఎం కీలక పాత్ర పోషించిందన్నారు. కాంట్రాక్టు కార్మికులను అన్యాయంగా తొలగించగా వారిని తిరిగి పనుల్లో తీసుకునేలా ఆందోళనలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 14న కలెక్టరేట్,



రొంపిచర్లలో కరపత్రాల పంపిణీ

ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.పెద్దిరాజు, సిలార్ మసూద్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రమైన రొంపిచర్లలో కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు మాట్లాడారు. మహిళలపై, బాలికలపై, ఎస్సీ, ఎస్టీలపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతోందన్నారు. జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తదితర సమస్యలపై పోరాడుతున్నామన్నారు.

శైలజ కుటుంబానికి వైసిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక కొత్త రెడ్డిపాలెంలో దళిత బాలిక పేరిపోగు శైలజ హత్యకు గురైన నేపథ్యంలో ఆ కుటుంబానికి వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శనివారం అందించారు. హత్య జరిగి మూడు నెలలు కావస్తున్నా నిందితుడు నాగరాజుపై చర్యలు లేవని నాయకులు విమర్శించారు.



చెక్కు ఇస్తున్న అంబటి రాంబాబు తదితరులు

కూటమిలో నామినేటెడ్ సందడి

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా ఇతర శాఖలకు నిధులను దారిమళ్లించడంపై ఆయన ఉద్యమాలు చేశారు. ఎన్నికల ముందు జనసేనలో చేరడంతో ఆ పార్టీ నుంచి కార్పొరేషన్ చైర్మన్ దక్కింది. రెంటచింతలకు చెందిన టిడిపి నాయకులు మంజులారెడ్డికి ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ చైర్‌పర్సన్ పదవి దక్కింది. ఆమెపై గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున వైసిపి నేతలు మూకుమ్మడిగా దాడి చేసి తల పగుల గొట్టారు. పార్టీ కోసం తీవ్రంగా కష్టపడిన ఆమెకు గుర్తింపు ఇచ్చారని పార్టీ వర్గాలు తెలిపాయి. నరసరావుపేటకు చెందిన గోనుగుంట్ల కోటేశ్వరరావుకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి దక్కింది. ఆయన 2017 నుంచి 2019 వరకు రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి నిర్వహించారు. వికలాంగుడైనా రాష్ట్ర స్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటారనే పేరుంది. రాష్ట్ర వైద్యారోగ్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మంగళగిరికి చెందిన జనసేన పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. జనసేన పార్టీ నుంచి ఆయన క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లో మంగళగిరికి పెద్ద పీట వేశారు. ఇప్పటి వరకు నందం అబద్దయ్య (పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్), తమ్మిశెట్టి జానకీదేవి (టిడిపి బోర్డు మెంబర్) పదవులు దక్కాయి. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా సలగల రాజశేఖర్‌బాబు అవకాశం ఇచ్చారు. ఇంకా జిల్లాలోని అనేక మంది సీనియర్లు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నా వారికి అవకాశం దక్కలేదు.

పుట్టిన రోజున బహుముఖ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలోని ఎఎం రెడ్డి స్మారక విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్‌ను ఆమె కట్ చేశారు. అనంతరం నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో సామాజిక సేవా, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల



అన్నదానం చేస్తున్న అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి

ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రుల్లో పండ్లు, బ్రెడ్, వికలాంగుల కోసం వీల్‌చైర్లు అందజేశారు. వృద్ధాశ్రమాలు, అనాధాశ్రమాల్లో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కోటప్పకొండ రెడ్ల సత్రంలో అన్నదానం చేవారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2 దశాబ్ధాలుగా ఎఎం రెడ్డి స్మారక విద్యాసంస్థల ద్వారా సమాజ శ్రేయస్సు కోసం, ప్రజాసేవే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎం రెడ్డి ఫార్మసీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, డిప్లమా కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ కృష్ణారెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రూ.75.24 లక్షల బయో ఉత్పత్తుల పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

అనధికారికంగా నిల్వ ఉంచిన బయో ఉత్పత్తులను గుర్తించారు. మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.75.24 లక్షల విలువైన బయో ప్రొడక్ట్స్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి, వాటిని పట్టణంలోని లక్ష్మీ వెంకట శ్రీనివాస ట్రేడర్స్‌కు అప్పగించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మరో రెండు బృందాలు బొల్లాపల్లి, ఈపూరు మండలాల్లో తనిఖీలు నిర్వహించి అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఎరువులు, పురుగు మందులను అమ్మకాలను నిలిపేయగా, మరి కొన్నింటిని సీజ్ చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి : కొమ్మాలపాటి శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో నియోజకవర్గాల పరిశీలకులు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ద్వితీయ శ్రేణి నాయకులతో సమన్వయం చేసుకొని సభ్యత్వంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి భరోసా ఉంటుందన్నారు. ఇప్పటికి 70 లక్షల సభ్యత్వంతో టిడిపి దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రాంతీయ పార్టీ బలంగా, క్యాడర్ పార్టీగా ఎదిగిందన్నారు. కార్యకర్త చెల్లించిన రుసుం తిరిగి వారికే లబ్ధి చేకూరేలా మంత్రి నారా లోకేష్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రమాద మృతులకు గతంలో ఉన్న రూ.2 లక్షల బీమాను రూ.5 లక్షలకు పెంచడంతో పాటు తక్షణ మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందిస్తారన్నారు. కూటమి నేతలు నిర్లక్ష్యం వహించకుండా నిత్యం ప్రజల మధ్యకు వెళుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సమస్యలు పరిష్కారం కోసం పని చేయాలన్నారు. తొలుత రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టిడిపి నరసరావుపేట పట్టణ అధ్యక్షులు కడియాల రమేష్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, నాయకులు ఎం.దారునాయక్, ఎన్.రాము, టి.జయప్రకాష్ నారాయణ, డి.ఉషారాణి, కె.రాజశేఖర్‌రెడ్డి, వి.సింహాద్రి యాదవ్, ఎన్.సౌరయ్య, కె.వెంకటేశ్వరరావు, వి.నాగేశ్వరావు, జి.జనార్ధన్‌బాబు, కె.కిరణ్, డి.ఉదయ్‌శ్రీ, కె.లక్ష్మి, కె.రాధిక పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

రక్తదానం చేయండి

ప్రజాశక్తి - చేబ్రోలు

రక్తదానం చేయండి ప్రాణదాతలుగా మారండి 'మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్' సభ్యుడు తిరుమల శెట్టి ఉమాశంకర్ అన్నారు. విజయవాడ హాస్పిటల్‌లో ఆపరేషన్ సమయంలో ఒకరికి రక్తం అవసరం కాగా వారు 'మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్'ను సంప్రదించారు. వెంటనే తిరుమలశెట్టి శ్రీనివాస్ స్పందించి రక్తదానం చేశారు. అందరూ వీలున్నప్పుడల్లా రక్తదానం, అన్నదానం చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ కోరారు. దానం చేయాలనుకున్నవారు 8333089722, 92999 99751 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై రేపు ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం పాత గుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన పథకం యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కొత్త మెనూకు కావాల్సిన సామాగ్రి ఇవ్వకుండా, మెనూ ఛార్జీలు పెంచకుండా, బిల్లులు సక్రమంగా అందించకుండా కొత్తగా ప్రతిపాదించిన మెనూ అమలు చేయటం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. మెనూ తయారు చేయడానికి కావలసిన పదార్థాలు, వంట సామాగ్రి లేకుండా కొత్త మెనూ ఎలా అందించాలని ప్రశ్నించారు. వేతనాలు ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సరైన ఎక్విప్‌మెంట్ లేకుండా వందల మంది పిల్లలకు ఏ విధంగా కొత్త మెనూ అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చినట్లే మధ్యాహ్న భోజనం నిర్వాహకులు కూడా సిలిండర్లు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న కూరగాయల ధరలతో రోజువారి మెనూ


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

తయారీకే ఇబ్బంది పడుతుంటే కొత్త మెనూలో ఫ్రైలు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ. వేతనం రూ.10వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ఎస్‌కె.షమీ అధ్యక్షత వహించగా, నాయకులు దేవకుమారి, సుమతి, శివ పార్వతి, వెంకాయమ్మ, ద్రాక్షావలి, ముక్తేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జీలను కాదు.. జగన్ తీరు మారాలి : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జీలను మార్చినా ప్రజలు వైసిపి నేతలను ఆదరించరని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తనపై పోటీ చేసి 51 వేల ఓట్ల తేడా ఘోరపరాజయం పాలైన మాజీ మంత్రి విడదల రజనినీ చిలకలూరిపేట ఇన్‌ఛార్జిగా నియమించడాన్ని ఆమె ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యేలను అటూ ఇటూ మార్చి ప్రజలను మభ్య పెట్టాలని చూశారని అయినా ప్రజలు ఆదరించకపోవడంతో ఇప్పుడు మళ్లీ అందరిని పాత స్థానాలకు పంపుతున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం అండ చూసుకొని, ఇష్టానుసారం దోచుకొని తిని, ప్రజల మీద దౌర్జన్యాలకు పాల్పడి డబ్బుతో గెలిచేయవచ్చు పక్క నియోజకవర్గంలో మన అవినీతి దౌర్జన్యాలు తెలియవు అనే అవివేకంతో పోటీ చేసిన ఎమ్మెల్యేలకు ప్రజలు ఇచ్చిన తీర్పుతో తత్వం బోధపడిందని, తమకు వైసీపీలో రాజకీయ జీవితం ఉండదన్న ఆలోచనకు వైసీపీ నేతలు వచ్చారని,పార్టీని వీడేందుకు సిద్దమయిన వారిని కాపాడుకోవటం కోసం నేడు వారికి పూర్వపు నియోజకవర్గానికి పంపిస్తే, వారిని ప్రజలు తిరిగి ఆదరిస్తారు అనుకోవటం అవివేకం అన్నారు.ముందు జగన్ రెడ్డి తన ఆలోచన విధానాలు మార్చుకోవాలని, తమను గెలిపించిన ప్రజల కోసం అసెంబ్లీకి జగన్ రెడ్డి ఎమ్మెల్యేలు రావాలన్న బాధ్యత కూడా లేకుండా ప్రవర్తిస్తున్నారని, జగన్ రెడ్డిని నమ్ముకొని ఇలా వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోతే ప్రజలే వారికి బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే గళ్ళ మాధవి తెలిపారు. గతంలో వైసిపి సామాన్య కార్యకర్త మొదలుకొని మంత్రుల వరకు ఇష్టానుసారం నోరు పారేసుకొని సోషల్ మీడియా వేదికగా జుగుబ్సాకరంగా పోస్టు పెట్టిన వారికి మద్దతుగా వైసిపి నేతలు, నేడు గుంటూరు ఎస్పీని కలవటం చూస్తే, నిస్సుగుగా నీచ రాజకీయాలు చేయటం వైసీపీకే చెల్లిందని, ప్రజలు వారిని అసహ్యించుకుంటున్నారని ఎమ్మెల్యే గళ్లా మాధవి మండిపడ్డారు.



విద్యుత్ భారాలపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కరెంటు బిల్లులు పై పెంచిన సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లచెరువు విద్యుత్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా జరిగింది. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు పాలొన్నారు. మస్తాన్ వలి మాట్లాడుతూ వైసిపి హయంలో ఏడు సార్లు కరెంటు ఛార్జీలు పెంచారని తాము అధికారంలోకి వస్తే ఛార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు మళ్లీ వైసిపి బాటలో పయనించడం తగదన్నారు. చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. డిస్కంలకు నష్టాలు వస్తే ఈ సొమ్మును ప్రభుత్వం భరించాలని ప్రజలు ఒకసారి బిల్లులు చెల్లించిన తరువాత మళ్లీ భారం మోపడం చట్ట విరుద్ధం అన్నారు. కాంగ్రెస్ నాయకులు నాయకులు గడ్డం పాల్ విజయ్ కుమార్, రాచకొండ జాన్ బాబు, బిళ్ళా సునిల్, కూచిపూడి విజయ, బొట్ల బ్రహ్మయ్య, యాన్నం సుధీర్,ఇంతియాజ్, అబట్టి రతయ్య, మోషే , షైక్ ముస్కాన్, షైక్ గౌస్య, రామకష్ణ,పాలపటి అనిల్, షైక్ శుభాని, అడుసుమల్లి శ్రీనివాసరావు, కంటేటి యాలమంద, పాకనటి నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి
'మేడ్' కృషి అభినందనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఏసీ కాలేజీలోని జెడి శీలం హాల్‌లో శనివారం మోడల్ అసోసియేషన్ అఫ్ దళిత్ ఎంప్లాయిస్ (మేడ్)రాష్ట్ర 7వ మహాసభ నిర్వహించారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ మేడ్ గత 7సంవత్సరాలుగా దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంచి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగటమే కాకుండ సమయం వచ్చిన ప్రతి సందర్భంలో చాలా గొప్పగా సామాజిక సేవాకార్యక్రమాలు చేయటం అభినందనీయం అన్నారు. రానున్న రోజుల్లో ఇంకా పురోగతి సాధించి దళిత ఉద్యోగుల ప్రగతికి పాటుపడాలని అన్నారు. లీడ్‌కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యారావు మాట్లాడుతూ రానున్న రోజులలో దళిత ఉద్యోగుల సంక్షేమానికి అవిరళ కషి చేసి వారి సమస్యల పరిష్కరానికి దిక్సూచిగా మేడ్ ఎదగాలి అని అన్నారు.మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ గత 7ఏళ్లుగా దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్న మేడ్ రాష్ట్రంలో 26 జిల్లాలో ఉనికి కలిగి ఉంది అని అన్నారు. ఈ సందర్భంగా 2024 నీట్‌లో ప్రతిభ చూపిన 6గురు విద్యార్థులకు అభినందనలు తెలిపి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంములో మేడ్ వ్యవస్థాపకులు ఎస్. శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శి పి.శామ్యూల్‌జోబ్, జిల్లా అధ్యక్షులు ఎల్. జయరాజు, జి.రామదాసు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో దాడి

ప్రజాశక్తి - తాడేపల్లి

కుటుంబ కలహాలు నేపథ్యంలో తాడేపల్లి పట్టణంలోని సీతానగరం పుష్కర గట్ల వద్ద ఓ వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. మొదట్లో అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ఇలా చెప్పారు. లంకె ప్రభాకర్ అనే వ్యక్తి కష్ణా నదిలో ప్రతిరోజు చేపల వేటకు వెళ్తాడు. శనివారం కూడా నదిలోకి వేటకు వెళ్లే క్రమంలో, ఇప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న నలుగురు వ్యక్తులు ఒక్కసారిగా ప్రభాకరపై దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబంలో వచ్చిన స్వల్ప వివాదాలే ఈ దాడికి కారణంగా కనిపిస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ ఘటనలో ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి - రెంటచింతల

దొంగతనం చేసి బంగారం ఎత్తుకెళ్లిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. రెంటచింతల మండలంలోని మంచికల్లు గ్రామానికి చెందిన శీలంనేని అనంతరామయ్య గృహంలో ఈ నెల ఏడో తేదీన దొంగతనం జరిగినది. ఈ ఘటనలో 12. 5 సవిరీల బంగారాన్ని దోచుకెళ్లారు. పోలీసులు దర్యాప్తు చేసి మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన కందుకూరి అన్నారావు, పాముల రాహుల్ పై కేసు నమోదు చేశారు. వీరు అనంతరామయ్య ఇంటికి పెయింటింగ్ వేయడానికి వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు ఎస్సై నాగార్జున తెలిపారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లద్దు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాదకద్రవ్యాలకు విద్యార్థి యువత దూరంగా ఉండాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్.కరీం ఆధ్వర్యంలో శనివారం పాత బస్టాండ్ టైటానిక్ షోరూమ్ నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి యువత, విద్యార్థులు,డ్రగ్స్ ఏ వద్దు రా చదువే ముద్దు రా అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి రాజీవ్ రతన్, మాజీ శాసనసభ్యులు షేక్.మస్తాన్ వలి,లింగం శెట్టి ఈశ్వర్ రావు, డిసిసి అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఇంచార్జి శ్రీపతి ప్రకాశం,డాక్టర్ షామా సుల్తానా , విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లపల్లి శ్రీనివాసరావుకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస విభాగం చైర్మన్ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జి చల్లపల్లి శ్రీని వాసరావు శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు, యువజన నాయకులు చిట్టెం అవినాష్ చిల్లపల్లి శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గాను ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తారని వారన్నారు.

'ఫ్రెండ్స్ ఫరెవర్' వనమహోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎకో పార్కులో ఫ్రెండ్స్ ఫరెవర్ ఆధ్వర్యంలో శనివారం మహిళల వన సమారాధన మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పలు ఆటలు పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేత మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫ్రెండ్స్ ఫరెవర్ పేరుతో ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి సమాజంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కొండ ప్రాంతంలో పార్కు అవడం వల్ల ఎన్నో రకాల ఆయుర్వేద వనమూలికలతో కూడిన చెట్లతో చాలా ఆహ్లాదకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫరెవర్ ప్రతినిధులు మాజేటి పార్వతి, పసుమర్తి సుజాత, నేరెళ్ల వాణి, పారేపల్లి రమ్య, మంచికంటి జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన, రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులతో వార్డెన్ తదితరులు

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు హాస్టల్ విద్యార్థి

ప్రజాశక్తి - వినుకొండ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్‌లో వినుకొండలోని బిసి బాలుర హాస్టల్ విద్యార్థి బి.జాషువా 100 మీటర్ పరుగులో మూడవ స్థానం సాధించారు. ఈనెల జార్ఖండ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో 4x100 మీటర్స్ రిలే జట్టుకు జాషువా ఎంపికైనట్లు హాస్టల్ వార్డెన్ కృపావతి తెలిపారు. శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 అథ్లెటిక్స్‌లో బి.హర్ష 100 మీటర్స్, 200 మీటర్స్‌లో నాలగవ స్థానం సాధించినట్లు చెప్పారు. సిరిపురంలో జరిగిన జిల్లా స్థాయి 200 మీటర్ల పరుగు పందెంలో ఎ.వెంకటరెడ్డి మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో శనివారం విద్యార్థుల అభినందన సభ నిర్వహించగా వార్డెన్‌తోపాటు ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.జాని, తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు సంతోష్ అభినందించారు. జాతీయ స్థాయిలోనూ బాగా రాణించాలని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా విద్యార్థులకు శిక్షణిస్తున్న అథ్లెటిక్ కోచ్ డి.అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి

సిపిఎం కార్యకర్త నండూరి వెంకటేశ్వరరాజుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆ పార్టీ అమరావతి పట్టణ, రూరల్ కార్యదర్శులు బి.సూరిబాబు, సయ్యద్ మొహుద్దీన్ వలి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈనెల 3 తేదీన ఎండ్రాయిలో అదే గ్రామానికి చెందిన టిడిపికి చెందిన గోరంట్ల నాగమల్లేశ్వరరావు రాజు, శివనాగ శేఖర్‌రాజు, వరప్రసాదు కలసి వెంకటేశ్వరరాజుపై మూకుమ్మడి దాడి చేశారని, అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఒక మహిళకి జరిగిన అన్యాంపై బాధితురాలికి వెంకటేశ్వరరాజు అండగా నిలబడ్డం వల్లే దాన్ని మనసులో పెట్టుకుని, కక్షపూరితంగా ఈ దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. న్యాయం కోసం నిలబడితే దాడులకు పాల్పడతారా? అని ప్రశ్నించారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించాలని, వెంకటేశ్వం రాజుతోపాటు అతని కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. లేకుంటే అధికార పార్టీ వారు మరిన్ని దుశ్చర్యలకు పాల్పడతారని, ప్రజాస్వామ్యంలో ఇవి చేయగూడనివని పేర్కొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే బిగ్ హెల్ప్ ధ్యేయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : తెలుగు రాష్ట్రాల్లో పేద విద్యార్థుల అభ్యున్నతే బిగ్ హెల్ప్ ధ్యేయమని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ షేక్ చాంద్ పాషా అన్నారు. శనివారం బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ 22వ వార్షికోత్సవం విజయ పురిసౌత్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా చాంద్ పాషా తన సొంత నిధులు రూ.5 లక్షలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, అనాథ, పేద విద్యార్థులకు సహాయం చేస్తూ, మౌలిక వసతులకల్పనకు బిగ్ హెల్ప్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బిగ్ హెల్ప్ మేనేజింగ్ ట్రస్టీ సరోజిని మాటూరి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కర్ బాబు, ఆఫీస్ అడ్మిన్ కొత్తపేట శంకరయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లేష్, మేనేజర్ ధనలక్ష్మి, హెచ్ఎం కాంతారావు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పాత్లావత్ రామ్‌చంద్ నాయక్, విజయపురిసౌత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలను విస్మరించి భారాలు వేస్తున్న ప్రభుత్వాలు



కరపత్రాలు పంచుతున్న నాయకులు

ప్రజాశక్తి- చిలకలూరిపేట

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ప్రచార యాత్ర శనివారం పట్టణంలోని 12వ వార్డులో గల పిల్లి అంకమ్మ చౌక్ వద్ద ప్రారంభమైంది. సిపిఎం కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చి ప్రభుత్వాల వైఫల్యంపై ప్రచారం చేశారు. సిపిఎం పట్టణ కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇసుక దొరక్క భవన నిర్మాణ కార్మికులకు పనులు ఉండడం లేదని, నిత్యావసర ధరలు పెరిగి పేదల జీవితాలు అస్తుబిస్తుగా మారాయని చెప్పారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను మరచి విద్యుత్ భారాలకు పూనుకుందన్నారు. ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరించిన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచిందన్నారు. సమస్యలపై ప్రజల దృష్టి మళ్లకుండా మత విద్వేషాలు రెచ్చగొడుతోందని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం చేసే పోరాటాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.లూథర్, ఎస్.బాబు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వము నిత్యావసర వస్తువుల ధరలను అదుపుచేసి చౌక దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను అందజేయాలని సిపిఎం మండల కార్యదర్శి



జి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని చాగంటివారిపాలెం రోడ్డు సెంటర్లో ప్రజాపోరు కరపత్రాలను పంపిణీ చేశారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. టి.అమరలింగేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.



ఫైనల్స్‌కు విశాఖ, కడప జిల్లాల బాలికల జట్లు

చిత్తూరు-గుంటూరు బాలుర జట్ల మ్యాచ్ టై - కొనసాగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శరభయ్య హైస్కూల్, నందిగామ జెడ్‌పి పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు శనివారం రెండో రోజుకు చేరాయి. నందిగామలో జరుగుతున్న పోటీల్లో క్రీడాకారులను తహశీల్దార్ కెవిఎస్ చక్రవర్తి పరిచయం చేసుకున్నారు. బాలికల విభాగంలో విశాఖపట్నం జట్టుపై వైఎస్ఆర్ కడప జిల్లా జట్టు 6-0 గోల్స్ తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. గుంటూరు జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 4-0 తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 1-0 గోల్స్‌తో విజయం సాధించి విజయనగరం జిల్లా జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరింది. చిత్తూరు, గుంటూరు జిల్లా జట్ల జరిగిన మ్యాచ్ టై అయింది. పోటీలను పిఇటిలు ఎల్.పిచ్చయ్య, అనిల్ దత్తా నాయక్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శివరామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

ఏపీ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్ అండ్ కల్చరల్ సొసైటీ చైర్మన్‌గా మంజులారెడ్డి

ప్రజాశక్తి- రెంటచింతల

సిఎం చంద్రబాబు శనివారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో రెంటచింతల మండలంలోని రెంటాలకు చెందిన చేరెడ్డి మంజులారెడ్డి పేరునూ ప్రకటించారు. ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ విజయవాడ (హస్త కళాభివృద్ధి) చైర్మన్‌గా ఆమెను ఎంపిక చేశారు. రాజకీయ నేపథ్య కుటుంబం నుండి వచ్చిన మంజులారెడ్డి ఈ సంవత్సరం మే 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున జరిగిన గొడవల్లో తీవ్రంగా గాయపడి వార్తల్లోకి ఎక్కారు. తనకు పదవి ఇచ్చిన చంద్రబాబు, అందుకు సహకరించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



జైల్లో ఉన్న 80 మందిలో 60 మంది వైసిపి వారే

- మేం అధికారంలోకి వచ్చాక కార్యకర్తల చేతులకే పాలనా పగ్గాలు
- జైల్లోని వైసిపి కార్యకర్తలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి అధికారంలోకి వస్తే పాలనా పగ్గాలను కార్యకర్తలకే చేతికే ఇస్తామని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలు, జగన్, ఆయన కుటుంబీకులపై టిడిపి సోషల్ మీడియా కార్యకర్తలు పెడుతున్న పోస్టులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు ఎస్. పిజెవి సంతోష్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైసిపికి చెందిన 175 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని, పల్నాడు జిల్లాలో 15 మందిని అక్రమంగా అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టి జైలుకి పంపారని అన్నారు. నరసరావుపేట సబ్ జైలులో 80 మంది ఉంటే 60 మంది వైసిపికి చెందిన వారున్నారన్నారు. దీనిపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. హామీలు అమలుపై కాకుండా కక్షపూరిత రాజకీయాలు చేయడం, వేధింపులకు పాల్పడడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. టిడిపి, జనసేన సోషల్ మీడియా కార్యకర్తలు అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారని వాటిపై డిజిపి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు హామీలు అమలుకు పాటుపడాలని, రెడ్‌బుక్ రాజ్యాంగానికి కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలని



మీడియాతో మాట్లాడుతున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

హితవుపలికారు. అనంతరం సబ్ జైలులోని వైసిపికి చెందిన వారిని పరామర్శించారు.

భార్య కోసం సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

ప్రజాశక్తి - క్రోసూరు : మండల కేంద్రమైన క్రోసూరులో శనివారం ఒక యువకుడు సెల్ టవర్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. ఎస్ఐ నాగేంద్రరావు వివరాల ప్రకారం.. క్రోసూరుకు చెందిన 22 ఏళ్ల షేక్ మస్తాన్‌వలి, సిరిపురానికి చెందిన యువతిని ప్రేమపెళ్లి చేసుకున్నారు. యువతి తల్లిదండ్రుల నుండి బెదిరింపులు రావడంతో ఇరు కుటుంబాల పెద్దలను పోలీసులు బైండోవర్ చేశారు. అయినా యువతిని ఆమె తల్లిదండ్రులు బలవంతంగా తీసుకెళ్లడంతో మస్తాన్‌వలి సెల్‌టవర్ ఎక్కాడు. పోలీసులు అతనితో సంప్రదింపులు జరిపి కిందికి దిగేలా చేశారు. అనంతరం యువతిని తీసుకొచ్చి పెద్దలతో చర్చించి సర్దిచెప్పారు.

జర్నలిస్టు కుటుంబాలకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా ప్రెస్ క్లబ్ నరసరావుపేట ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మాక్సీ విజన్ కంటి హాస్పిటల్ సౌజన్యంతో పట్టణంలోని ఐఎంఎ భవన్‌లో శనివారం జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎవి రామలింగారెడ్డి, డాక్టర్ చెంచిరెడ్డి డాక్టర్ శాంతి దంపతులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి సందర్శించారు. ఐఎంఎ పల్నాడు జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగోతు ప్రకాశరావు, ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షులు బి.ఎన్ ప్రసాద్, అధ్యక్షులు సిహెచ్. రమణారెడ్డి, సెక్రెటరీ పి.నాగరాజు, కోశాధికారి ఎ.శివ, ఎన్.జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



డాక్టర్ చెంచురెడ్డి, శాంతి దంపతులకు సత్కరిస్తున్న జర్నలిస్టులు

పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం ప్రజాపోరు

రాజధాని ప్రాంత విద్యార్థులకు వర్సిటీల్లో ఉచిత విద్య అందించాలి

14న తుళ్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రజా సమస్యల పరిష్కారాని కై సిపిఎం 'ప్రజా పోరు' ప్రచార యాత్ర రాజధాని గ్రామాల్లో కొనసాగింది. రాజధాని లోని మండల కేంద్రమైన తుళ్లూరులో శనివారం సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి ప్రచార యాత్రను ప్రారంభించి మాట్లాడారు.ప్రజాపోరు జాత తుళ్లూరు, దొండపాడు, అబ్బరాజు పాలెం, బోరుపాలెం, వడ్లమాను, పెదపరిమి, రాయపూడి, లింగాయపాలెం, వెలగపూడి, మల్కాపురం, మందడం,తాళాయి పాలెం, వెంకటపాలెం గ్రామాలలో కొనసాగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతు ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా పోరును జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నవంబర్ 14 న తుళ్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రోజురోజుకీ పెరుగుతున్న అధిక ధరలతో ప్రజలు సతమతమవుతుంటే అది చాలదన్నట్లుగా విద్యుత్ ట్రూ అప్ చార్జీలను పెంచి ప్రజలపై 17వేల కోట్ల రూపాయల విద్యుత్ బారాలను మోపడం ఏమాత్రం సరైనది కాదని,ప్రభుత్వం వెంటనే పెంచిన ట్రూ అప్ ఛార్జీలను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో ప్రారంభం కాబోతున్న రాజధాని అభివృద్ధి పనులలో స్థానికులకే పనులు కల్పించాలని రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజధాని అమరావతి అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు అప్పుగా కాకుండా, కేంద్ర ప్రభుత్వమే గ్రాంట్ గా ఇవ్వాలని కోరారు. రాజధాని నిర్మాణంలో జాప్యం జరిగినందున రైతులకు కౌలు, పేదలకు



తుళ్లూరు ప్రజాపోరులో మాట్లాడుతున్న ఎం రవి

పెన్షన్ మరో 10 ఏళ్ళు పొడిగించాలని కోరారు. రాజధానిలో నిర్మించిన యూనివర్సిటీలలో రాజధాని లోని విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని అన్నారు. రాజధానిలో రైతులు, కూలీలు, కార్మికుల పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాజధాని గ్రామాలలో అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు లలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అరకొర జీతాలు ఇస్తున్నారని,వారి వేతనాలు పెంచాలని రవి కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం భాగ్యరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు కుంభా ఆంజనేయులు, పేరం బాబురావు, గైరబోయిన నాగేశ్వరరావు, షేక్ జానీ, పా బత్తుల వెంకటేశ్వరరావు, కైలా స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు స్థలాలిచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

కాకుమాను మండలంలో ప్రజాపోరు ప్రచారయాత్ర

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు ప్రచార ఉద్యమాన్ని నివారం కాకుమాను మండలంలోని కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు, కొండపాటూరు, కాకుమాను గ్రామాలలో నిర్వహించారు. కరపత్రాల పంచుతూ, గ్రూప్ మీటింగ్లు నిర్వహిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు లు మాట్లాడుతూ కాకుమాను మండలంలో ఎరువుల కొరత నివారించాలని, నాగులపాడు మార్కెట్ యార్డులో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించడానికి అవసరమైన నిధులను వెంటనే కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలి ఇచ్చి, ఇల్లు నిర్మించాలన్నారు. రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నాయని, వెంటనే బాగు చేయాలని కోరారు. వ్యవసాయ అభివృద్ధికి కీలకమైన పంట కాలువల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. స్కీము వర్కర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వేతనాల పెంపు అమలు చేయాలని కోరారు. ఈ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రచార ఉద్యమాన్ని గ్రామాలలో కరపత్రాల ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో ప్రజలందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కాకుమాను మండలం గార్లపాడు ప్రచారంలో సిపిఎం నాయకులు

12,13 తేదీల్లో మంగళగిరిలో సిపిఎం ప్రజాపోరు

జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజా సమస్యల పరిష్కారానికై మంగళగిరిలో ఈనెల 12, 13 తేదీలలో జరిగే ప్రజా పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శనివారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. రామారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఈనెల 14వ తేదీన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చాక నిత్యవసర సరుకుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. ధరలను నియంత్రించే పరిస్థితిలో బిజెపి ప్రభుత్వం లేదని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ 20 ఏళ్ల మందికి ఇళ్ల పట్టాలి ఇచ్చి ఇల్లు కట్టి ఇచ్చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య , ఎం రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్, ఎం బాలాజీ, పట్టణ కమిటీ సభ్యులు ఎం చలపతి రావు, ఎస్ వెంకటేష్, జే బ్రాహ్మణి, ఎస్ గణేష్ పాల్గొన్నారు.



ఇజ్రాయిల్ పేటలోప్రచారం చేస్తున్న కార్యకర్తలు



స్వర్ణభారతి నగర్‌లో ప్రచారం



మహిళలు, బాలలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలో తుమ్మపూడి గ్రామంలో ప్రజాపోరు ప్రచారాన్ని సిపిఎం నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చాక నిత్యవసర సరుకులు పెట్రోలు డీజిల్ వంటగ్యాసు ధరలో అదుపు లేకుండా పెంచేసిందని విమర్శించారు. ప్రజలకు ఉపాధి తగినంతగా లేకపోవడంతో అర్ధాకలితో అలమట్టిస్తున్నారని మరోవైపు నిరుద్యోగం సమస్య తీవ్రమవుతున్నదని, చెప్పారు మహిళలపై బాలికలపై దాడులు జరుగుతున్నాయని వీటిని ప్రభుత్వాలు అదుపు చేయలేకపోతున్నాయని విమర్శించారు ఈనెల 15 న.మండల కేంద్రాల వద్ద ప్రజా సమస్యలపై జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమంలో సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి డి చిరంజీవి మండల నాయకులు వై లలిత ఎం కోటమ్మ మధుసూదన్ రావు, ఎం నాగమల్లేశ్వరరావు ఎం ఇందిరా మీ బుల్లిబాబు పాల్గొన్నారు.



తెనాలిలో కొనసాగుతున్న ప్రజాపోరు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నిత్యవసర ధరలు తగ్గించకపోగా, కరెంటు చార్జీలు భారం ప్రజలపై వేస్తున్న ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నవంబర్ 15న నిర్వహించబోయే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ అన్నారు. ప్రజాపోరు ప్రచార క్యాంపెయిన్ లో భాగంగా శనివారం పాండురంగ పేటలో కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను ప్రక్కదోవ పట్టించేందుకే జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమౌతుందన్నారు. ధరలు నియంత్రణ, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించలేకపోవడం, మహిళలపై అత్యాచారాలు అరికట్ట లేకపోవడంపట్ల తీవ్రంగా విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజాపోరు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి తదితరులు పాల్గొన్నారు.



15న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చేబ్రోలు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు ప్రచార కార్యక్రమాన్ని శనివారం చేబ్రోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.సిపిఎం పొన్నూరు మండల నాయకులు ఎన్ రమేష్‌బాబు మాట్లాడుతు బిజేపి పాలనలో కార్పొరేట్ సంస్థలకు విపరీతమైన లాభాలు సంపాదిస్తున్నప్పటికీ, మోడీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ సంస్థలకే రుణమాఫీ చేస్తున్నది ఊడిగం చేస్తుందని దుయ్యబట్టారు. జమిలి ఎన్నికలకు బిజెపి ప్రభుత్వం తీర్మానించినదని, దీని వలన భారత రాజ్యాంగం లో భాగమైన ఫెడరల్ విధానం దెబ్బ తినడంతో పాటు, రాష్ట్రాలు ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి 15న గుంటూరు కలెక్టరేట్ ధర్నా జయప్రతం చేయాలని రమేష్‌బాబు కోరారు. ప్రచారంలో నాయకులు రాం బ్రహ్మాచారి, ఆంటోని, సెల్వం రాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు అదుపు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలపై ఈనెల 11న కలెక్టర్ ఆఫీసు వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ రామిరెడ్డితోట ఇజ్రాయిల్ పేటలో సిపియం నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతప్రభుత్వంలో ట్రూఆప్ చార్జిల పేరుతో కరెంటు చార్జీలు పెంచి ప్రజల మీద అధిక భారాలు వేశారని, బాదుడే బాదుడు అని ప్రచారం చేసి, మేము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన నాలుగు నాలుగు నెలలకే రూ.6,100 కోట్లు పెంచిందని, మరో రూ.11వేల కోట్లు పెంచటానికి సిద్ధం అయ్యిందన్నారు. ఇసుక అందుబాటులో లేక కార్మికులకు పని దొరకట్లేదన్నారు. ఉచిత ఇసుక హామీని అమలు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరిం చాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, కిన్నెర, నక్కమస్తాన్, ఆకవరపు యశ్వంత్ పాల్గొన్నారు.

స్వర్ణభారతి నగర్‌లో ప్రజాచారం : పుచ్చలపల్లి సుందరయ్య నగర్ సిపియం శాఖ ఆధ్వర్య ంలో 41వ వార్డు స్వర్ణ భారతి నగర్ మెయిన్ రోడ్డు, పెట్రోల్ బంక్ వద్ద ప్రజాపోరు క్యాంప్‌లో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఖాసిం షహీద్, ఆది నికల్సన్, షేక్.మస్తాన్‌వలి, గుజ్జనగుండ్ల శాఖ కార్యదర్శి షేక్.బాషా పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన తాడేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద జరుగు ప్రజా పోరు ను జయప్రదం చేయాలని, సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు అన్నారు. శనివారం రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో ప్రజా పోరు పోస్టర్ ను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివ శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్యానికే ముప్పుగా మారిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకీ విపరీతంగా పెరుగుతున్నప్పటికీ ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆయన అన్నారు. ఒకవైపున ఇసుక అందుబాటులోకి లేక భవన నిర్మాణ కార్మికులు, సరైన ఉపాధి లేక వ్యవసాయ కార్మికులు, సామాన్య పేదలు పనులు లేక అనేక ఇబ్బందులు



పడుతుంటే, నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై మరింత భారం వేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుందని ఇది సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం గుండి మేడ గ్రామ శాఖ కార్యదర్శి పల్లె కృష్ణ, జెట్టి నాని, రామారావు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు,సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో విద్యార్థి హనిగురు

కోలుకున్న హాస్టల్ విద్యార్థులు

ప్రజాశక్తి-ఈపూరు

ఐరన్ మాత్రలను అధిక మోతాదులో తీసుకొని అస్వస్థతకు గురై నరసరావుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు కోలుకున్నారు. బాధిత విద్యార్థులైన చల్లా సతీష్, మక్కెన హనిగురు ఆరోగ్యం సాధారణ స్థితికి వచ్చినట్లు హాస్టల్ వార్డెన్ బి.వెంకటేశ్వర్లు నాయక్ శనివారం తెలిపారు. వీరిద్దర్నీ జిల్లా సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కె.సంతోష్ కుమార్ సమక్షంలో వారి తల్లిదండ్రులకు కొద్దిరోజుల విశ్రాంతి నిమిత్తం అప్పచెప్పినట్లు వార్డెన్ తెలిపారు.



మిరప మొక్కలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో చీడపీడల నియంత్రణ

ప్రజాశక్తి-ఈపూరు

పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రన్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో మిర్చి పొలాలను ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు పరిశీలించారు. మిరప పంట వేసే ప్రతి రైతు ఎకరాకు 400 కిలోల ఘనజీవామృతం వేయడం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందడంతో పాటు మొక్కలకు అన్ని రకాల పోషకాలు లభిస్తాయన్నారు. భూమి సారవంతం అవుతుందని, రైతుకు పెట్టుబడి తగ్గుతుందని చెప్పారు. ప్రధాన పంటతో పాటు అంతర పంటలుగా ఉల్లి, బంతి, ముల్లంగి, కొత్తిమీరను ప్రతి రెండు మిరప మొక్కల తర్వాత మార్చి మార్చి వేసుకోవడం ద్వారా ఘాటైన వాసన వల్ల మిరప పంటకు అపార నష్టం కలిగించే నల్ల తామర పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. అంతర పంటల ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా శిక్షకుడు టి.సైదయ్య, డివిజన్ ఎమ్‌టి తిరుపతిరావు, భాస్కరరావు, ప్రకాష్‌రావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు, పెదకూరపాడు పిహెచ్‌సిలో గర్భిణులకు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం అందించారు. తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆదిత్య మాట్లాడుతూ పౌష్టికాహార ప్రాధాన్యాన్ని వివరించారు. ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాదు పాల్గొన్నారు.



బోధన బదులు 'అపార్' పనులు


- ఉపాధ్యాయులకు శిరోభారంగా విద్యార్థుల వివరాల నమోదు
- ఇంటర్నెట్ సదుపాయం లేక అవస్థలు
- ఆధార్ సవరింపుల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులకు కొత్త చిక్కులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు ఉపాధ్యాయులకు పనిభారం అవతుండగా తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతోంది. వివరాలు సరిగా నమోదు కాకపోవడం, నెట్‌వర్క్ సమస్యలు తదితర సాంకేతిక ఇబ్బందులను ఉపాధ్యాయులు ఎదుర్కొంటుంటే విద్యార్థుల తల్లిదండ్రులు కూలి పనులు మానుకుని నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ అదనపు ఖర్చులు బరాయిస్తున్నారు.

వన్ నేషన్-వన్ స్టూడెంట్ పేరుతో ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఐడెంటిటీని కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తెచ్చింది. దేశంలో ఎవ్వరి విద్యార్హతలకు సంబంధించిన వివరాలైనా తెలుసుకునేందుకు వీలుగా ఆధార్ కార్డు తరహాలో జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికీ ఒక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నారు. ఆయా విద్యాసంస్థల్లోని కంప్యూటర్ల ద్వారా విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఈ వివరాల నమోదు తలనొప్పిగా మారింది. కంప్యూటర్లు లేని పాఠశాలల్లో సెల్‌ఫోన్ల ద్వారా పాఠశాల రికార్డులు, ఆధార్‌లోని వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ రెండింటి వివరాల్లో వ్యత్యాసాలుంటే నమోదు కావడం లేదు. కొన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ అందుబాటులో లేక సమస్యలు వస్తున్నాయి. ఇది బోధనపైనా ప్రభావం చూపుతోంది. మరోవైపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుండి ఒత్తిళ్లు ఎక్కువవుతున్నాయి.

చిలకలూరిపేటలోని శ్రీమద్ది కామయ్య జెడ్‌పి పాఠశాలలలో 367 మంది విద్యార్థులుండగా వీరిలో 74 మంది వివరాలు నమోదు పూర్తవ్వలేదు. కొంతమంది ఆధార్‌లోని వివరాలు తప్పుగా ఉంటున్నాయని, వాటిని తాము సరిచేసి నమోదు చేస్తున్నామని, విద్యార్థులు ఆధార్ కార్డుల్లో సరిచేయించుకోవాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పరీక్ష ఫీజు చెల్లించాలన్నా ఆధార్ వివరాలు తప్పనిసరి కావడంతో చాలామంది విద్యార్థులు తమ ఆధార్‌ల సవరణ కోసం మీసేవ కేంద్రాల బాటపట్టారు. కొంతమంది తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లడం మానుకుని ఇదే పనిలో నిమగ్నమయ్యారు. సవరణలకు సాధారణంగా రూ.50 తీసుకోవాల్సి ఉండగా రూ.150 రూ.200 తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనికితోడు మార్పులకు వారానికిపైగా పడుతుండగా ఈ సవరణలు గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మరీ ఇబ్బందిగా తయారయ్యాయి.



చిలకలూరిపేట మండలంలో 88 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిల్లో 1-10 తరగతి విద్యార్థులు ఆరేడు వేల మంది వరకు ఉన్నారు. ప్రైవేటు పాఠశాలలు 70 ఉండగా వీటిల్లో 13 వేల మంది వరకూ ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 60-70 శాతం విద్యార్థుల నమోదు పూర్తవగా ప్రైవేటు పాఠశాలల్లో సగానికంటే తక్కువగానే పూర్తయినట్లు సమాచారం. అందర్నీ పూర్తి చేయాలంటే తాము బోధనకు బదులు యాప్ పనిలో ఉండాల్సి వస్తోందని, బోధనేతర పనులు తమకు అప్పగించొద్దని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే శాస్త్రవేత్తలుగా ఎదిగారు..

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ - కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



స్కాలర్‌షిప్ అందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్టు సేవలను ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తృతం చేస్తామని ట్రస్టు చైర్మన్ అయిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. సత్తెనపల్లి రఘురామ్ నగర్ ప్రజావేదికలో ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థిని విద్యార్థులకు ఉపకార వేతనాలను శనివారం పంపిణీ చేశారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 11 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తేనే పిల్లలకు చదువు వస్తుందని తల్లిదండ్రులు భావించడం సరికాదని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన చాలామంది శాస్త్రవేత్తలుగా దేశానికి ప్రపంచానికి సేవలందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం హైస్కూల్ వరకు పిల్లల్ని చదివించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. 2013 నుంచి ట్రస్ట్ ద్వారా ఉపకార వేతనాలు, ఆసుపత్రులకు అవసరమైన మౌలిక వసతులు, నిరుపేదల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు వై.రామస్వామి, కె.వెంకటేశ్వరరావు, పి.వెంకట కోటయ్య, డి.నాగేశ్వరరావు, జాన్‌బాబు, జనసేన నాయకులు టి.భావనారాయణ, బిజెపి నాయకులు కె.శంకరరావు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా న్యాయవాది ఏర్పాటు

ప్రజాశక్తి - మాచర్ల

ఉచిత న్యాయసేవలను, లోక్ అదాలత్‌లను కక్షిదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఎజిపి) జి.వెంకటేశ్వర్లు అన్నారు. న్యాయసేవా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక కస్తూరిభా పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సత్వర న్యాయం పొందేందుకు ఉన్న అనేక అవకాశాలను వివరించారు. నిరుపేదలకు ఉచితంగా ప్రభుత్వమే న్యాయవాదిని ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సేవలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టిలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాది గంగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార కమిటీ సభ్యులు ఎం.గోవిందరెడ్డి, ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.





వికలాంగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : సూర్యకిరణ్ పేరెంట్స్ అసోసియేషన్, మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక సూర్యకిరణ్ దివ్యాంగుల పాఠశాలలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మాచర్ల ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టరు ఉదయభాను పాఠశాలలోని వికలాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులుండే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. డాక్టరు దశరథ, వజీమ్, ఫిజియోథెరిఫి వైద్యులు సైదులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి

ప్రజాశక్తి - వినుకొండ : 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నుపాటి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏపీఎన్జీవో హోమ్‌లో జిల్లా కార్యదర్శి తమ్మిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల అధ్యయన తరగతులు శనివారం నిర్వహించారు. మంజుల మాట్లాడుతూ గత ఆరు నెలలనుండి ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజిఎల్ఐ బకాయిలు కోట్ల రూపాయల్లో పేరుకుపోయానని చెప్పారు. 11వ పీఆర్సీ బకాయిలు, 90 నెలల పెండింగ్ డి.ఏలను ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం చెప్పాలన్నారు. ఉపాధ్యాయులకు పనిభారంగా మారిన 62 యాప్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అపార్ వల్ల వస్తున్న ఇబ్బందులు తొలగించి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. నాయకులు పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యావిధానంతో కూడిన కామన్ స్కూల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ నెలవారీ పదోన్నతులు పునరుద్ధరించి సబ్జెక్ట్ టీచర్స్ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు జీఓ 07,08 అనుగుణంగా సిద్ధం చేయాలని కోరారు. ఎంఇఒ పోస్టులను చేయాలన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మిస్సింగ్ క్రెడిట్స్ క్లియర్ చేయకుండా నెలల తరబడి పెండింగులో ఉంచుట వలన ఉద్యోగ విరమణ అనంతర చెల్లింపుల్లో తీవ్ర జాప్యమవుతోందని, రూ.వేలల్లో ఉపాధ్యాయులు నష్టపోతున్నారని తెలిపారు. నాయకులు ఎం.శ్రీనివాసరావు, మహమ్మద్ ఉస్మాన్, వి.వి.రవికుమార్, మహమ్మద్ ఖాలీద్ పాల్గొన్నారు.

ఆదాయానికి గండి కొడితే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని జిఎంసికి సంబంధించిన మార్కెట్లు, సైకిల్‌స్టాండ్‌లు, మరుగుదొడ్లు, సండ్రీస్ మార్కెట్లలో ఆశీలను నగరపాలక సిబ్బందికి మాత్రమే చెల్లించి రశీదు పొందాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. దళారులు వసూళ్లకు వస్తే నేరుగా నగర పాలకసంస్థ కాల్‌సెంటర్‌కి ఫోన్‌చేసి (0863-2345103) ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జిఎంసికి చెందిన వివిధ మార్కెట్లు, సైకిల్ స్టాండ్‌లు, మరుగుదొడ్ల నుండి ఆశీలు వసూళ్లకు గతంలో పాటదార్ల గడువు ముగిసినందున, కొత్తగా టెండర్ కం ఓపెన్ ఆక్షన్ ఆమోదం కోసం జిఎంసి స్థాయి సంఘానికి పంపామన్నారు. ఆమోదం వచ్చే వరకు జిఎంసి సిబ్బందే డిపార్ట్మెంట్ వసూళ్లు చేస్తున్నారన్నారు. కావున నగరంలోని జిఎంసికి ఆశీలు చెల్లించే వారు నగరపాలక సంస్థ ఐడి కార్డుతో, జిఎంసి అధీకత రశీదు అందించే వారికే ఆశీలు ఇవ్వాలని తెలిపారు. కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, పివికె నాయుడు కూరగాయల మార్కెట్, పాల ఆసుపత్రి వద్ద కూరగాయల మార్కెట్, అరండల్ పేట 1వ లైన్‌లోని పచ్చగడ్డి మార్కెట్, సండ్రీస్ మార్కెట్‌లో వ్యాపారుల నుండి, పివికె నాయడు మార్కెట్ ఉత్తర, దక్షిణం వైపు ఫెన్సింగ్‌లో, వెన్‌లాక్ మార్కెట్‌లో సైకిల్ స్టాండ్‌లు, కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద, ఎన్టీఆర్ బస్టాండ్, కష్ణా పిక్చర్ ప్యాలెస్ సెంటర్, బండ్ల బజార్ వద్ద, గాంధీ పార్క్ వద్ద, విజ్ఞాన మందిరం రోడ్ లోని, తహసీల్దార్ (వెస్ట్) కార్యాలయం వద్ద, పాల ఆసుపత్రి వద్ద, నాజ్ సెంటర్ వద్ద ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ రుసుములను జిఎంసి సిబ్బందే వసూళ్లు చేస్తున్నారని, ఏ విధమైన దళారులకు ఆశీలు చెల్లించవద్దని కమిషనర్ తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

గుంటూరు నగరంలో పెరుగతున్న ట్రాఫిక్, జనాభా అవసరాల దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం పురప్రముఖుల అభ్యర్థనల మేరకు విజయవాడలోని బుడమేరు సంఘటన గుంటూరులో ఉత్పన్నం కాకుండా గుంటూరు నగరపాలక సంస్థ నగరంలోని ప్రధాన డ్రైన్లు, రోడ్ల ఆక్రమణల తొలగింపు చేపట్టిందని, ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం కమిషనర్ అమరావతి రోడ్, నంది వెలుగురోడ్, ఇన్నర్ రింగ్‌రోడ్, నలంద నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత అమరావతి రోడ్‌లో జరుగుతున్న డ్రైన్, రోడ్ల ఆక్రమణలను పరిశీలించి, ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో సిల్ట్ తీయాలన్నారు. ఒకసారి తొలగించిన ఆక్రమణలు తిరిగి ఏర్పాటు చేయకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. బస్టాండ్ ఎదురు ఆక్రమణలు తొలగించడంతోపాటు ప్రకటనల హోర్డింగ్స్ డ్రెయిన్ ముందుకు రాకూడదని, వెంటనే తొలగించాలన్నారు. ఆక్రమణదారులకు రెండు రోజుల్లో తొలగించుకోవాలని ముందుగా తెలియచేసి, సోమవారం నుండి పూర్తి స్థాయిలో తొలిగించడానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సదరు ప్రాంతంలోని రైతు బజార్‌కి వచ్చే వినియోగదార్ల వాహనాలు రైతు బజార్ ప్రాంగణంలోనే పార్క్ చేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. నందివెలుగు రోడ్ విస్తరణ చేసినప్పటికీ ఆక్రమణల వలన ఉపయోగం లేకుండా ఉందని, తక్షణం ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని తొలగించాలని ఏసిపిని ఆదేశించారు. అనంతరం నలంద నగర్‌లో స్థానిక కార్పొరేటర్ యం.పద్మశ్రీతో కలిసి పర్యటించి, ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. పర్యటనలో ఈఈలు కోటేశ్వరరావు, సుందర్రామిరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఏసిపి రెహ్మాన్, జాతీయ వినియోగదార్ల సమాఖ్య ఉపాధ్యక్షులు డాక్టర్ సిహెచ్.హరిబాబు, డిఈఈ రమేష్, ఏఎంహెచ్‌ఓలు ఆనందకుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ బయోపిక్ చిత్రీకరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్


నటీనటులపై క్లాప్ కొడుతున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయ చంద్ర

బాబు జగ్జీవన్ రామ్ సినిమాలో కొన్ని సన్నివేశాలను తెనాలిలో చిత్రీకరించారు. స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో శుక్రువారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సినీ సెట్ లో పలువురు ఎమ్మెల్యేలు నటించారు. తొలుత వేమూరి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ప్రతిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కేశన శంకర రావు పాల్గొని నటీనటులపై క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయులు సమావేశంలో దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ గతంలో మంత్రులతో సినిమాలు చేసిన అనుభవంతో ఆరుగురు ఎమ్మెల్యేలతో ఈ చిత్రాన్ని తెంకెక్కిస్తున్నట్లు తెలిపారు. దర్శకుడిగా చిత్రానికి కావలసిన సన్నివేశాలు, నటీనటులను తమదైన శైలిలో ఎంపిక జరిగిందన్నారు. పాత్రలకు అనుకూలమైన ముఖ కవళికలు ఉండటంతో ఆరుగురు ఎమ్మెల్యేలను ఎంపికచేసామన్నారు. స్వతంత్ర సమరయోధుని సినిమాలో నటించే అవకాశాన్ని కల్పించిన దర్శకులు దిలీప్ రాజకు ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. జగ్జీవన్‌రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్, భగత్ సింగ్ పాత్రలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, చంద్రశేఖర్ ఆజాద్ పాత్రలో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర నటిస్తున్నారు. చిత్రానికి డిఓపిగా మురళీకృష్ణ, కెమెరామెన్ వంశీ, ఆర్ట్ డైరెక్టర్ రత్నాకర్ కనపర్తి, ప్రొడక్షన్ ఇన్చార్జిగా శ్రీకాంత్, మేకప్ జనార్ధన్, లైటింగ్ చింతా మణి కుమార్, ప్రొడక్షన్ షేక్ హాజీ పనిచేస్తున్నారన్నారు.



ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకు చట్టం తేవాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంటులో చర్చ పెట్టాలని సోషలిస్ట్ జనతా కాంగ్రెస్ కూటమి జాతీయ నేత ఎల్ జైబాబు డిమాండ్ చేశారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో శనివారం వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు సామజిక వేత్తలతో సోషలిస్ట్ జనతా కాంగ్రెస్ కూటమి రౌండ్ టేబుల్ సమావేశం గుంటూరు జిల్లా అధ్యక్షులు పొదిలి వెంకట్రావు అధ్యక్షతన జరిగినది. యల్. జైబాబు మాట్లాడుతూ నూతన ఆర్థిక సంస్కరణలో ప్రభుత్వం రంగం కుదేలయ్యిందని, ప్రభుత్వాల ప్రోత్సాహంతో ప్రైవేటు రంగం విస్తరించిందన్నారు. అందువలన ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేసేలా పాలకుటు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్ చల్లగాలి ఆనంద్ బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లోని లక్షల కోట్లు పెట్టుబడులు కేంద్రం విత్ డ్రా చేయడం మూలంగా ఎస్సీ, ఎస్టీలు 2లక్షల ఉద్యోగాలు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కంచర్ల కాశయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్ సాగర్, సోష లిస్ట్ కూటమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు వీర భాస్కర్ ఉద్యోగ జేఏసీ ఛైర్మన్ సిహెచ్ ఆనంద బాలరాజు, యూసఫ్ అహ్మద్ ,సునీల్, నవీన్, కె గణేష్ ,పి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పవన్ కుమార్

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకై నిరంతరం కృషి చేయాలని జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పవన్ కుమార్ అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా శనివారం అంగలకుదురు బిసి బాలికల హాస్టల్‌లో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి సేవా మార్గంలో నడుచుకోవాలన్నారు. మహిళలకు న్యాయ సేవ సంస్థల ద్వారా ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలో వివరించారు. జాతీయ న్యాయ సేవ సంస్థకు చెందిన మొబైల్ యాప్ ద్వారా అర్జీ ఎలా పూర్తిచేయాలో తెలియజేశారు. చట్టాలను ప్రజలకు చేరువ చేసే న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించాలని కోరారు. సోషల్ మీడియా పట్ల విద్యార్థులు, మహిళలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

విఐటి 'స్టార్స్' విద్యార్థులకు ఉచిత ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు


ల్యాప్‌టాప్‌లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశ్యంతో విఐటి వ్యవస్థాపకులు డాక్టర్ జి విశ్వనాథన్ సంకల్పం మేరకు విశ్వవిద్యాల యంలో స్టార్స్ (సపోర్ట్ ది అడ్వాన్స్ మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించామని విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కళాశాలల్లో మొదటి ర్యాంక్ సాధించిన 26 జిల్లాల విద్యార్థుల నుండి ఒక విద్యార్థి, విద్యార్థినీ ఎంపికచేసి విశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్యతో పాటు వసతిని, ప్రాథమిక వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 49 మంది విద్యార్థులకు శనివారం ఉచితంగా లాప్ ట్యాప్ లను పంపిణి చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ వి కోట రెడ్డి మాట్లాడుతూ స్టార్స్ ప్రోగ్రాం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరమని అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డాక్టర్ డి వెంకట లక్ష్మి (స్టార్స్ కోఆర్డినేటర్) డాక్టర్ జాన్ ప్రదీప్ (డిప్యూటీ డైరెక్టర్ అడ్మిషన్స్) విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ కాపు సంఘం కేంద్ర కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి : కాపుల అభ్యున్నతి సంక్షేమమే లక్ష్యంగా జాతీయ కాపు సంఘం పని చేస్తుందని జాతీయ కాపు సంఘం జాతీయ అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణ నాయుడు అన్నారు. మంగళగిరి రత్నాలచెరువు బైపాస్ సర్వీస్ రోడ్డు వద్ద జాతీయ కాపు సంఘం కేంద్ర కార్యాలయంను శనివారం మురళీకృష్ణ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ కాపుల రిజర్వేషన్ పై కాపు సంఘాలను అన్నిటిని ఒక చోటకు తీసుకువచ్చి, 7 శాతం రిజర్వేషన్ అమలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. అమరావతి రాజధానిలో కాపులకు 5 ఎకరాలు భూమిని ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ గౌరవ అధ్యక్షులు తోట సాంబశివరావు, మహిళా అధ్యక్షురాలు ముద్రగడ్డ కాంత్రి, ఆకుల జయసత్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా వర్సిటీ దూరవిద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష శనివారం సజావుగా జరిగినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, దూర విద్యా కేంద్ర పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి రామచంద్రన్ లు తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీతో పాటు ఆదిత్య డిగ్రీ కాలేజ్ (కాకినాడ), ఎం ఎస్ ఆర్ ఎస్ సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ (విశాఖపట్నం), గీతం డిగ్రీ కాలేజ్ (ఒంగోలు), గేట్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి), శ్రీ విజయ దుర్గ డిగ్రీ కాలేజ్ (కర్నూలు), శ్రీ సాయి డిగ్రీ కాలేజ్ (అనంతపూర్) ఈ పరీక్ష జరిగిం దన్నారు. ఆదివారం సాయంత్రం ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామన్నారు. ప్రవేశ పరీక్షలు అర్హత సాధించిన అభ్యర్థులు, ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీ లోగా ఆయా కోర్సులలో ప్రవేశాలు పొందాలని సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు

యార్లగడ్డ జయప్రద, రామయ్య ఛారిటీస్ మరియు శంకర కంటే ఆసుపత్రి, జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం కొండపాటూరు జిల్లా పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూలులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు క్యాంపు ఉంటుందన్నారు. భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు ఆధార్, రేషన్, ఓటర్ కార్డుల లో ఏదైనా రెండు రకముల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. పరిసర ప్రాంతాల ప్రజల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

62 మంది విద్యార్థులకు వినికిడి మిషన్‌ల పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

శనివారం జాతీయ న్యాయ సేవల దినోత్సవ ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ థాకూర్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ జి నరేందర్ అధ్వర్యంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు(విజయనగరం) వారి సహకారంతో విఐటి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మడోనా డెఫ్ అండ్ డంబ్ స్కూల్ కి సంబంధించిన ప్రత్యేక ప్రతిభావంతులైన 62 మంది విద్యార్థులకు వినికిడి మిషన్ లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ జి నరేందర్ మాట్లాడుతూ సామాజిక,ఆర్థిక కారణాల రీత్యా ఎవరూ న్యాయస్థానాలను సంప్రదించడానికి వెనుకాడకూడదని, వారి కోసం ఉచిత న్యాయ సహాయం అందుబాటులో వుందని తెలియ జేశారు.

ఎమ్మెల్సీ ఓటు కోసం 2615 మంది దరఖాస్తు

ప్రజాశక్తి దుగ్గిరాల : స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమంలో భాగంగా శని వారం బిఎల్‌ఓలు మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద క్రొత్త ఓట్ల చేర్పులు కార్యక్రమాన్ని ప్రారంభించారనీ స్థానిక తాసిల్దార్ ఐ సునీత తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా 17 అర్జీలు వచ్చాయన్నారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆమె తెలిపారు. ఎమ్మెల్సీ ఓట్ల కోసం మండల వ్యాప్తంగా 2615 మంది నమోదు చేసినట్లు ఆమె తెలిపారు ఆన్లైన్ ద్వారా రెండు వేల మంది ఆఫ్లైన్ ద్వారా (అర్జీల ద్వారా దరఖాస్తులు అందజయడం) 615 మంది నమోదు చేసుకున్న రు. ప్రస్తుతం బిఎల్‌ఓ ల ద్వారా విచారణ జరుపుతున్నట్లు విచారణ అనంతరం అర్హులకు ఓటు హక్కు కల్పించనున్నట్లు ఆమెతెలిపారు.

నేడు దుగ్గిరాలలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండల కేంద్రం దుగ్గిరాలలోని కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత రక్తనాళాల వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి బి రాంబాబు తెలిపారు. రక్తనాళాల వైద్య శిబిరంలో హైదరాబాద్ కు చెందిన ఏషియన్ వ్యాస్క్యులర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారు. వెరికోస్ వైన్స్ ఉన్నవారు సేవలు పొందవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

నేడు గుంటూరుకు పవన్ కల్యాణ్ రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం గుంటూరు రానున్నారు. స్థానిక నగరంపాలెంలోని అటవీ శాఖకు చెందిన అరణ్యభవన్‌లో జరగనున్న అటవీ అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈకార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరు అవుతారు.


అశోక్‌కుమార్


బ్రహ్మజీరావు


కృష్ణారావు


పూర్ణచంద్రరావు


రామచంద్రన్

ఎఎన్‌యు అధ్యాపకులు ఆరుగురికి ఉత్తమ అవార్డులు


త్రిమూర్తిరావు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆరుగురు అధ్యాపకులు ఎంపికయ్యారు. వీరిలో ఆచార్య ఎన్. వి. కృష్ణారావు (తెలుగు), ఆచార్య డి. రామచంద్రన్ (కెమిస్ట్రీ), ఆచార్య వై. అశోక్ కుమార్ (అంబేద్కర్ చైర్), ఆచార్య యం.త్రిమూర్తి రావు (సోషల్ వర్క్), డాక్టర్ పి. పూర్ణచంద్రరావు (టూరిజం), డాక్టర్ పి. బ్రహ్మజీరావు (ఎన్విరాన్మెంటల్ సైన్స్) ఉన్నారు. వీరికి ఈ నెల 11వ తేదీన విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అవార్డులను అందించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లను చేస్తోంది. కాగా ఉత్తమ అధ్యాపక అవార్డుకి ఎంపికైన దూర విద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్‌కు దూరవిద్య కేంద్రంలో శనివారం ఘన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం అసిస్టెంట్ రిజిస్టర్ పి. కష్ణవేణి, సూపరింటెండెంట్ ఏం. రమాదేవి, డాక్టర్ మండూరి వెంకటరమణ, పి. దేవకాంత్, డాక్టర్ పి. భరత్ పాల్గొన్నారు.

సకురా సైన్స్ ప్రాజెక్ట్‌కు ఎంపికైన విజ్ఞాన్ అధ్యాపకులు

ప్రజాశక్తి-గుంటూరు


అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ, తదితరులు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు అధ్యాపకులు జపాన్‌లోని సకురా సైన్స్ ప్రాజెక్ట్-2024కు ఎంపికయ్యారని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. శుక్రవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్.ఎస్. సంపత్‌కుమార్, డాక్టర్ చింతగుంట అంజనీ దేవి జపాన్ దేశం టోక్యోలోని జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జేఎస్టీ) ఏడు రోజులపాటు యూనివర్సిటీ ఆఫ్ మియజాకీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'సకురా ప్రాజెక్ట్ 2024'కు ఎంపికయ్యారని తెలియజేశారు. నవంబర్ 10 నుంచి 16వరకు జరిగే ఈ కార్యక్రమానికి భారతదేశం అంతటా కేవలం 12 మందిని మాత్రమే ఎంపిక చేశారని, అందులో ఇద్దరు విజ్ఞాన్స్ యూనివర్సిటీ నుంచి ఎంపికవడం హర్షనీయమన్నారు. వీరు బయోటెక్నాలజీ రంగంలో వినూత్న పరిశోధనలను అభివద్ధి చేయడంతోపాటు పరిశోధనల ప్రాధాన్యత ఆధారంగా చేసుకుని ఈ ప్రాజెక్ట్‌కు ఎంపికయ్యారన్నారు. ఆయా అధ్యాపకులను వీసీ ప్రొఫెసర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ పెట్రోలు, సిఎన్‌జి బైక్ విడుదల

ప్రజాశక్తి-గుంటూరు


బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న శివరాంప్రసాద్ తదితరులు

స్థానిక అమరావతి రోడ్డులోని సిద్ధి వినాయక బజాజ్ షోరూంలో బజాజ్ ఆటో లిమి లిటెడ్ పూణే వారిచే తయారు చేయబడిన ఫ్రీడం 125 సిసి పెట్రోల్ కం సిఎన్‌జి ఆప్షన్లతో లభ్యమయే బైక్‌ను మార్కెట్‌లో లాంఛనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా ఎస్‌బిఐ ఆటోనగర్ బ్రాంచి మేనేజర్ జె.శివరాంప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజాజ్ కంపెనీ ఎప్పటికప్పుడు మార్కెట్ అభిరుచికి అనుగుణంగా బైక్‌లను తయారు చేస్తుంటారని, ఇప్పుడు ఫ్రీడం 125 సిసి పెట్రోల్ కం సిఎన్‌జి ఆప్షన్లతో వచ్చిందన్నారు. సిద్ధి వినాయక బజాజ్ మేనేజర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్రీడం 125 సిసి డ్రం, ఎల్ఇడి, డిస్క్, ఎల్‌ఈడిలతో లభ్యం అవుతుందన్నారు. డ్రం ఎక్స్‌షోరూం ధర 94,995ల నుండి మొదలవుతుందని, పొడవాటి సౌకర్యవంతమైన సీటుతో లభ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో గుంటూరు టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, జుబేర్ మేస్త్రీ, టీం లీడర్ యోగేంద్ర, సాయి పాల్గొన్నారు.

రేపు వీధి వ్యాపారులతో సమావేశం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలో వీధివ్యాపారుల సమస్యల పరిష్కారానికి సోమవారం సాయంత్రం 5 గంటలకు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారుల సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు, వివిధ డ్రైన్లపై కూడా వీధి వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, ప్రధాన డ్రైన్ల పూడిక తీత పనులకు ఆటంకం ఏర్పడుతున్నందున, తేలికపాటి వర్షానికే రోడ్లు వర్షపు నీరు నిలబడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మురుగు నీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతున్నారు. జిఎంసి డ్రైన్ ఆక్రమణల తొలగింపు లో వీధి వ్యాపారుల సమస్యలపై చర్చించడానికి సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశానికి వీధి వ్యాపార సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కమీషనర్ కోరారు.

వీక్షణం

రాజకీయ వివాదాల్లో పోలీసులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పోలీసులు తరచూ రాజకీయ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. అధికారపార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరించి ఇబ్బంది పడే వారు కొందరు అయితే ప్రతిపక్ష పార్టీలకు అనుకూలంగా పనిచేశారన్న అభియోగాలపై కూడా ఇటీవల పలువురు అధికారులు వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఎవరికి వారు తాము నిబంధనల మేరకు వ్యవహరించామని సమర్థించుకుంటున్నా అధికారులకు మాత్రం ఎదో వర్గం నుంచి విమర్శలను మూటగట్టుకోకతప్పడం లేదు.రిపబ్లికన్ పార్టీ ఆధ్యక్షులుగా తనకు తాను ప్రకటించుకుని వైసిపి ప్రభుత్వ హయంలో రెచ్చిపోయిన బోరుగడ్డ అనిల్ కుమార్‌ను ఇటీవల పలు కేసుల్లో అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు పంపారు. జగన్ ఆదేశిస్తే చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ను చంపుతానంటూ వైసిపి హయంలో పెట్రోగిపోయారు. అయితే అనిల్‌కుమార్ అరెస్టు తరువాత కూడా పోలీసులు నిబంధనల మేరకు వ్యవహరించడం లేదన్న విమర్శలు వచ్చాయి. ఇటీవల అనిల్‌కుమార్‌ను గుంటూరు నుంచి రాజమండ్రి జైలు కి తీసుకు వెళ్తుండగా మార్గ మధ్యలో నిందుతుడు కి రాచ మర్యాదలు చేయడం పై తీవ్రంగా పరిగణించిన పోలిస్ ఉన్నతాధికారులు ఇద్దరు రిజర్వుడు పోలీసు అధికారులతో పాటు ఏడుగురు పోలీసులను సస్పెండ్ చేశారు. జిల్లాలోని పలు స్టేషన్ల నమోదు అయిన పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండ్ విధిస్తూ రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు నుంచి తిరిగి రాజమండ్రి తీసుకువెళ్తుండ గా గన్నవరం వద్ద ఒక రెస్టారెంట్ లో చికెన్ బిర్యాని పెట్టించారన్న వార్తలు రావడంతో ఎస్కార్ట్ గా వెళ్లిన ఆర్. ఎస్. ఐ, ఏ.ఎస్.ఐ. మరో ఐదుగురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే గత నెలలో అరండల్‌పేటలో అరెస్టు చేసిన సమయంలో పోలీసు స్టేషన్‌లో రాత్రి వేళ నిద్రకు ఆయనకు రాచ మర్యాదలు చేశారన్న అభియోగాలకు సంబంధించి మరో వీడియో శనివారం బయటకు వచ్చింది. దీంతో ఈ అంశంపై అరండల్‌పేట పోలీసు అధికారులు ఇరకాటంలో పడ్డారు. ఈ అంశంపై ఎస్‌పి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అనిల్‌కుమార్‌ను పోలీసు కస్టడీకి తీసుకున్న సమయంలో ఆరోగ్య సమస్యలు ఉన్నాయని తెలిసి కనీస వసతులు కల్పించామని వివరణ ఇచ్చారు. అలాగే రెండు నెలల క్రితం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి భర్త రామచంద్రరావు వత్తిడి మేరకు ఒక రియల్టర్‌పై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసిన నేపథ్యంలో పట్టాభిపురం సిఐ కిరణ్‌ను సస్పెండ్ చేశారు. మంగళగిరిలో టిడిపి కార్యాలయంపై దాడి ఘటనలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రూరల్ సిఐ భూషణంను సస్పెండ్ చేశారు. నల్లపాడులో సిఐ బత్తుల శ్రీనివాసరావు కూడా మరో వివాదంలో సస్పెండ్ అయ్యారు. మాజీ ఎంపి నందిగం సురేష్ అరెస్టు సమయంలో కూడా మంగళగిరి రూరల్ పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంపై కూడా అధికార పార్టీ నుంచి విమర్శలు వచ్చాయి. మంగళగిరి టిడిపి కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడు పానుగంటి చైతన్య నాలుగు నెలల పాటు అజ్ఞాతంలో ఉండి నేరుగా వచ్చి మంగళగిరి కోర్టులో లొంగిపోయిన తీరు పోలీసుల వైఫల్యానికి దర్పణం పట్టింది. పలు కేసుల్లో నిందితులు ఉన్న ప్రజా ప్రతినిధులు, రాజకీయ పెద్దల విషయంలో ఒక విధంగా, సామాన్యుల విషయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. చట్టం ముందు అందరూ సమానమేనని ఉన్నతాధికారులు చెప్పుకుంటున్నా వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉండటం, ప్రతి అంశం సోషల్ మీడియాలో వెలుగుచూస్తుండటం వల్ల పోలీసు అధికారులు రాజకీయ నిందితుల పట్ల మరింత జాగురూకతతో చట్టబద్ధంగా వ్యవహరించాల్సి ఉంది.

(ఎవిడి శర్మ)

25 తర్వాత 108 ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు : సమస్యల పరిష్కారం కోసం 108 ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. పలు రూపాల్లో ప్రభుత్వానికి విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో సమ్మెకు వెళ్లబోతున్నట్లు ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, బాబు, రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 25 తర్వాత సమ్మె నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులును నేరుగా నిర్వహించాలని, అధికారుల హామీ మేరకు శ్లాబ్‌ల ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించాలని, సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు శ్లాబ్‌లు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఇఎంటి పోస్టులలో 108 ఇయంటిలను నియమించాలని, పైలెట్లు ఇయంటిలకు ఇతర ఖాళీలలో వారి అర్హతను బట్టి వెయిటేజి ఇచ్చి నియమించాలని, పైలెట్లను ఆర్టీసీలో డ్రైవర్లుగా వెయిటేజీ ఇచ్చి నియమించాలని, 8 గంటల పని విధానం అమలు, మరణించిన ఉద్యోగులకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. జిఒ 49 ప్రకారం ఇచ్చిన రూ.4వేలు తిరిగి పునరుద్ధరించాలని, ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, 108 సేవల్లో ఖాళీలు భర్తీ చేయాలని తదితర డిమాండ్లపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె చేయనున్నట్లు చెప్పారు.

తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు



సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ చంద్రశేఖర్ తదితరులు

సరైన ఔషధ వినియోగం ద్వారా హాస్పిటల్ వ్యయాన్ని తగ్గించి, రోగులకి తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స అందిం చవచ్చని యూఎస్ఏ- ఓహాయోలోని యూని వర్సిటీ ఆఫ్ ఫిండ్లే ప్రొఫెసర్ ఎం.చంద్ర శేఖర్ అన్నారు. వడ్ల మూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన క్లినికల్ ఫార్మసీ ప్రాక్టిస్ అండ్ రీసెర్చ్ అనే అంశంపై రెండ్రోజుల సదస్సు ముగిసింది. ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్లినికల్ ఫార్మసీ అనేది వైద్యరంగంలో రోగులకు సమర్థవంతమైన ఔషధ చికిత్స అందించడంలో సహకరిస్తుందన్నారు. ఫార్మసిస్టులు వైద్యులతో కలిసి పనిచేస్తూ, రోగులకు సరైన మందులు, సరైన మోతాదు, సరైన చికిత్స అందించడంలో కీలక పాత్ర పోషిస్తారన్నారు. క్లినికల్ ఫార్మసీ సేవలు వైద్యరంగంలో రోగులకు ఆరోగ్యపరంగా మంచి ఫలితాలు సాధించడానికి దోహదపడతాయన్నారు. ఇప్పటికే చాలా ఆసుపత్రులు, ఆరోగ్య సంస్థలు క్లినికల్ ఫార్మసిస్టులను నియమిస్తూ, రోగులకు మెరుగైన ఆరోగ్యసేవలు అందిస్తున్నాయన్నారు. ఫార్మసిస్టులు రోగుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడం, ఔషధ ప్రభావాలను పర్యవేక్షించడం, ఔషధ పరమైన సమస్యలను గుర్తించి పరిష్కరించడం వంటి విధుల్లో పాల్గొనాలని సూచించారు. ముంబాయిలోని ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీ ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ మీన చింతమనేని మాట్లాడుతూ పరిశోధనా పరంగా ఈరంగంలో నూతన సాంకేతికతలను ఉపయోగించి భారతదేశంలో ప్రత్యేక పరిస్థితుల్లో రోగుల ఆరోగ్యం పెంపొందించేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫార్మసీ విద్యార్థులు, నిపుణులు రోగుల పట్ల మరింత దష్టి సారించేందుకు వివిధ రకాల పరిశోధనలు చేయాలన్నారు. క్లినికల్ ఫార్మసిస్టులు మాత్రమే మెరుగైన, సమర్ధవంతమైన ఔషధ వాడకం తయారు చేస్తారన్నారు. క్లినికల్ ఫార్మసీ ద్వారా వ్యాధుల గుర్తింపు, ఔషదాల ఖచ్చితత్వం, రోగుల ఆరోగ్య పరిరక్షణ అందించడం సులభమవుతుందన్నారు. సదస్సులో యూఎస్ఏలోని అవినిడా సొల్యూషన్స్ సీఈవో డాక్టర్ కార్తీక్ రాకమ్ మాట్లాడారు.కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్‌లు, పాల్గొన్నారు.

కష్టపడేవారికి టిడిపిలో గుర్తింపు : డేగల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పార్టీలో కష్టపడిపనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందని టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా తనను నియమించినందుకు టిడిపి అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బిజెపి నాయకురాలు పురందేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సాయంత్రం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. సర్పంచ్ స్థాయి నుంచి ఈ స్థాయికి చేరుకుంటానని తాను ఊహించలేదన్నారు. పార్టీ కష్ట కాలంలో అండగా ఉండి ప్రజల్లో మమేకమై పనిచేసినందుకు తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులకు దన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో యర్రగోపు నాగేశ్వరరావు,కొండెపు శేఖర్ యాదవ్,బీరం వెంకటేశ్వరరావు,బీరం శ్రీను,బొక్కిసమ్ శివరాం,షేక్ హనీఫ్,మేకల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు నేడు పాక్షిక అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు : నగరానికి తాగునీరు సరఫరా చేయు ప్రధాన పంపింగ్ కేంద్రాలైన ఉండవల్లి, తక్కెళ్ళపాడు ప్లాంట్ల వద్ద శనివారం విద్యుత్ మరమ్మతుల వలన విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడినందున ఆదివారం నగరంలో తాగునీటి సరఫరా పాక్షికంగా జరుగుతుందని జిఎంసి సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమల్లేశ్వరరావు తెలియజేశారు. గుంటూరు నగరానికి కృష్ణాబారేజి వద్ద ఉండవల్లి పంపింగ్ కేంద్రం నుండి మంగళగిరి పంపింగ్ ద్వారా తక్కెళ్ళపాడు పంపింగ్ కేంద్రాలకు ముడినీటి సర ఫరా జరుగుతుందని, తక్కెళ్ళపాడు పంపింగ్ కేంద్రం వద్ద ముడినీరు శుద్ధి చేయబడి నగరంలోని అన్ని రిజర్వా యర్లకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. విద్యుత్ అంతరాయం వలన సరఫరాలో ఆటంకం ఏర్పడినందున తాగునీటి సరఫరా ఆదివారం పాక్షికంగా జరుగు తుందన్నారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు. ఆదివారం సాయంత్రం నుండి తాగునీటి సరఫరా యధావిధిగా జరుగుతుందన్నారు.